సాక్షి
చిత్తూరు
శనివారం ౹ 15 ౹ జూన్ ౹ 2024



నీలి కిరణాలతో అంధత్వం

నేడు సెల్ ఫోన్ వినియోగం ఎక్కువగా ఉంది. వాటి నుంచి వచ్చే నీలి కిరణాలతో అంధత్వం వచ్చే అకాశం ఉంది. - 8లో



జిల్లా రగ్బీ జట్టు ఎంపిక

బాపట్లలో ఈనెల 15, 16 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు చిత్తూరు జిల్లా జట్టును శుక్రవారం ఎంపిక చేశారు. - 8లో



ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తీశ్వర స్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారికి అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తం దానం చేస్తున్న విద్యార్థులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రక్తదానం ప్రాణదానంతో సమానమని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతీదేవి తెలిపారు. చిత్తూరు నగరం గిరింపేటలోని అపోలో మెడికల్ కాలేజీలో శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రక్తదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చునన్నారు. దీని వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని పేర్కొన్నారు. అనంతరం పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు. జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌ను వేగవంతం చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతీదేవి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): బీసీజీ వ్యాక్సినేషన్‌ను వేగవంతం చేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతీదేవి తెలిపారు. ఆమె శుక్రవారం చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ సర్వేలో గుర్తించిన వారందరికీ కచ్చితంగా వ్యాక్సిన్ వేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వ్యవహరించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణులకు అందించే వైద్య సేవల్లో నిర్లక్ష్యం ఉండరాదని సూచించారు.

ట్రాన్స్‌కో స్టోర్స్ పరిశీలన



స్టోర్స్‌ను పరిశీలిస్తున్న జీఎం మురళీ

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో స్టోర్స్‌ను శుక్రవారం డిస్కం క్వాలిటీ కంట్రోల్ జీఎం మురళీ పరిశీలించారు. నెలలో స్టోర్స్‌కు వస్తున్న విద్యుత్ పరికరాల నివేదికను తీసుకున్నారు. అలాగే పలు విడి భాగాలను పరిశీలించారు. విడిభాగంపై ఉన్న వివరాల ప్రకారం వాటి బరువు, పొడవు, క్వాలిటీ తదితరాలను తనిఖీ చేశారు. అదే విధంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఎన్ని వస్తున్నాయి, ఎన్ని అవసరం అని అడిగి తెలుసుకున్నారు. సకాలంలో పరికరాలు వచ్చేలా ఇండెంట్ పెట్టుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం హమాలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో డీఈ జయప్రకాష్, ఏఈ వివేకానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ రోజున గోవధ నిషేధం

చిత్తూరు అర్బన్: బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని, అదే సమయంలో గోవధను నిషేధిస్తూ న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పును తప్పకుండా పాటించాలని చిత్తూరు ఎస్పీ మణికంఠ కోరారు. మత సామరస్యాన్ని తెలిపే ఈ పండుగ రోజున గోవులను అక్రమంగా తరలించడం, వధించడం చేయవద్దని సూచించారు. అలాగే ఒక వర్గాన్ని రెచ్చగొట్టేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టవద్దని తెలిపారు. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘిస్తే 9440900005, 112 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

18న ఐటీఐలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 18వ తేదీన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వీ.శ్రీలక్ష్మి తెలిపారు. ఈ డ్రైవ్‌కు తిరుపతి జిల్లాలోని వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. ఐటీఐ పాసైన అభ్యర్థులు అర్హులని, ఆసక్తి గల వారు 18వ తేదీ ఉదయం 9గంటలకు బయోడేటా, పది మార్కుల లిస్ట్, ఐటీఐ ప్రొవిజినల్ జిరాక్స్ కాపీలు, ఆధార్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరవ్వాలన్నారు. 94416 65290, 96764 86 678 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

పర్మిట్లు లేకున్నా రైట్‌రైట్

కొన్నేళ్లుగా కర్ణాటక ఆర్టీసీ బస్సులు పర్మిట్లు లేకుండానే మన రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో యథేచ్ఛగా తిరుగుతున్నాయి. రద్దీని బట్టి తిరుపతి, పలమనేరు, చిత్తూరు, పుత్తూరు తదితర ప్రాంతాలకు అధిక సంఖ్యలో బస్సులను నడుపుతున్నారు. ఇటీవల ఎన్నికల నేపథ్యంలో వారి ఆగడాలు శ్రుతిమించాయి. కర్ణాటకలోని కోలారు, ముళబాగిళు, శ్రీనివాసపుర డిపోల నుంచి రిజర్వులో ఉన్న బస్సులను సైతం అంతర్‌రాష్ట్ర పర్మిట్లు లేకున్నా స్పెషల్ బస్సులను పంపినట్టు పంపేస్తున్నారు. నిబంధనలను పాటించకుండా నడుస్తున్న కర్ణాటక బస్సులను చూసి ఇక్కడి ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు మనోవేదన చెందడం మినహా వాటిని అడ్డుకోలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా మన రాష్ట్ర ఖజానాకు గండి పడుతోంది.



పర్మిట్ లేకుండా పలమనేరు మీదుగా చిత్తూరుకు వెళుతున్న కేఎస్‌ఆర్టీసీబస్సు (ఫైల్)

- నిబంధనలు పాటించని కేఎస్‌ఆర్టీసీ
- రద్దీని బట్టి తిరుపతికి ఎక్కువ బస్సులు
- పర్మిట్ లేకుండా వెళితే కర్ణాటకలో ఏపీ బస్సుల సీజ్
- పట్టించుకోని ఏపీ రవాణా శాఖ
- ఇప్పటికే అడ్డుకున్న స్థానిక ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు
- తనిఖీలు చేస్తామంటున్న ఏపీ రవాణా శాఖ అధికారులు

పలమనేరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తిరుపతి, మంగళం, తిరుమల, చిత్తూరు తదితర డిపోల నుంచి కర్ణాటకలోని బెంగళూరుకు 125 దాకా ఏపీఎస్ ఆర్టీసీ అంతర్‌రాష్ట్ర బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. ఇవన్నీ ఎప్పటినుంచో పక్కాగా పర్మిట్లు ఉన్న వాహనాలే. అదేవిధంగా కర్ణాటకలోని పలు డిపోల నుంచి మన రాష్ట్రంలోకి పర్మిట్లున్న అక్కడి బస్సులు 70 దాకా ఉన్నాయి. కానీ నిత్యం పర్మిట్లు లేని బస్సులు పదుల సంఖ్యలో తిరుపతికి వచ్చి వెళుతూనే ఉన్నాయి. ఇక్కడి రవాణాశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో వారు ఇష్టారాజ్యంగా బస్సులను తిప్పుతున్నారు.

ఇష్టారాజ్యంగా స్పెషల్ బస్సులు

కర్ణాటకలో ప్రయాణికుల రద్దీని బట్టి పలు డిపోలకు చెందిన బస్సులను తిరుపతి, బోయకొండ, తమిళనాడులోని మేల్‌మరువత్తూర్, తిరువణ్ణామలై తదితర పుణ్య క్షేత్రాలకు అనుమతుల లేకుండానే యథేచ్ఛగా పంపుతున్నారు. మన రాష్ట్రానికి చెందిన ఏ బస్సుకు అయినా అనుమతుల్లో చిన్నపాటి ఇబ్బంది ఉన్నా అక్కడి ట్రాన్స్‌ఫోర్ట్ అధికారులు సీజ్ చేస్తున్నారు.

పలుమార్లు అడ్డుకున్న ఏపీఎస్ ఆర్టీసీ

కర్ణాటక నుంచి జిల్లాలోకి ఇష్టారాజ్యంగా వస్తున్న బస్సులను పలమనేరు, చిత్తూరు డిపోలకు చెందిన ఆర్టీసీ అధికారులు పలుమార్లు అడ్డుకున్నారు. రవాణా శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో వాటిని వదిలేశారు. దీంతో మరింత రెచ్చిపోయిన కర్ణాటక వారు బస్సులను రెట్టింపుచేసి మన రాష్ట్రంలోకి పంపుతున్నారు. ఫలితంగా మన ఖజానాకు గండి తప్పడం లేదు. ఈ విషయమై స్థానిక ఆర్టీసీ డీఎం టీకే స్వామిని వివరణ కోరగా కొన్నాళ్ల నుంచి కర్ణాటక డిపోలకు చెందిన బస్సులు పర్మిట్లు లేకుండానే వస్తున్నట్టు సమాచారం ఉందన్నారు. దీనిపై తమ సిబ్బంది ఇక్కడి ట్రాన్స్‌పోర్ట్ అధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లినట్టు చెప్పారు.

రాత్రిపూట అడిగే దిక్కులేదు

పలమనేరు, చిత్తూరుకు పొరుగునే ఉన్న ముళబాగిలు, కోలార్, చింతామణి, శ్రీనివాసపుర నుంచి రాత్రి సర్వీసులు పదికిపైగా బస్సులు పర్మిట్లు లేకుండానే పలమనేరు మీదుగా తిరుగుతున్నాయి. ఫలితంగా మనరాష్ట్ర రవాణాశాఖ కంటే వీరికి భారీగా ఆదాయం దక్కుతోంది.

ఇకపై పటిష్టంగా తనిఖీలు చేస్తాం



ఇన్నాళ్లు ఎన్నికల పనిలో కొంత బిజీగా ఉన్నాం. కర్ణాటక నుంచి అంతర్‌రాష్ట్ర పర్మిట్లు లేకుండా బస్సులు వస్తున్నాయనే సమాచారం మాకూ ఉంది. ముఖ్యంగా రాత్రిపూట రహస్యంగా బస్సులను ఇక్కడికి పంపుతున్నట్టు తెలిసింది. తనిఖీలను ముమ్మరం చేస్తాం. నిబంధనలకు విరుద్ధంగా తిరిగే కర్ణాటక బస్సులను సీజ్ చేస్తాం.

– మధుసూదన్, ఎంవీఐ, పలమనేరు

17 నుంచి అప్పలాయగుంటలో బ్రహ్మోత్సవాలు



శ్రీవారి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేఈఓ వీరబ్రహ్మం

- 16న అంకురార్పణ
- 21న గరుడ వాహనం
- పోస్టర్లు ఆవిష్కరించిన జేఈఓ వీరబ్రహ్మం

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన టీటీడీ అనుబంధ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 నుంచి ప్రారంభమవుతాయని జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు. ఆయన శుక్రవారం తన కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న అంకురార్పణ చేపడతామన్నారు. 17న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 18న ఉదయం చిన్నశేష వాహనం, సాయంత్రం హంస వాహనం, 19వ తేదీ ఉదయం సింహ వాహనం, సాయంత్రం ముత్యపు పందిరి వాహనం, 20న ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం కల్యాణోత్సం, సర్వభూపాల వాహనం, 21 ఉదయం మోహినీ అవతారం, సాయంత్రం గరుడ వాహనం, 22వ తేదీ ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం గజ వాహనం, 23న ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, 24 ఉదయం రథోత్సవం, సాయంత్రం అశ్వవాహనం, 25వ తేదీ ఉదయం చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. ఈ మేరకు ఏర్పాట్లు చురుగ్గా చేస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓలు గోవిందరాజన్, గుణభూషణ్‌రెడ్డి, శివప్రసాద్, చీఫ్ పీఆర్‌ఓ డాక్టర్ రవి, అదనపు ఎఫ్ఏసీఏఓ రవిప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు పాల్గొన్నారు.

యూపీఎస్సీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

తిరుపతి అర్బన్: యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో పరీక్షల నిర్వాహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన (ఆదివారం) నిర్వహించనున్న ఈ పరీక్షకు జిల్లాలో 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ పరీక్షలకు 5,518 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్టు వెల్లడించారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో ఈ నెల 15, 16 తేదీల్లో కంట్రోల్ రూమ్స్‌కు 9000665565, 9676928804 ఉంటాయని, ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఈ పరీక్షలకు అబ్జర్వర్‌గా జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యాన్‌చంద్ర వ్యవహరిస్తారని చెప్పారు. తిరుపతి ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి పరీక్ష పేపర్ల కస్టోడియన్‌గా వ్యవహరించనున్నట్టు వెల్లడించారు. ఆదివారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండు సెషన్లల్లో పరీక్ష జరుగుతుందన్నారు. 30 నిమిషాల ముందే పరీక్ష కేంద్రాల ప్రధాన గేట్లు మూసివేస్తారని.. ఆపై ఒక్క నిమిషం ఆలస్యం అయినా అనుమతి ఉండదని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, యూపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

బాలమిత్రుల విషాద గాథ

స్నేహితుడి పుట్టిన రోజును బాగా జరుపుకోవాలని ముగ్గురు స్నేహితులు అనుకున్నారు. హడావుడిగా కేక్ కోసం పరుగులు పెట్టారు. కాసేపట్లో సంబరం చేసుకుందామనుకున్నారు. ఇంతలోనే వారి సంతోషం ఆవిరైంది. వాహనం రూపంలో వచ్చిన మృత్యువు ఆ ముగ్గురిని కబళించింది. సంఘటన స్థలంలోనే వారి ప్రాణాలను బలితీసుకుంది. దీంతో మహా సముద్రం కన్నీటిపర్యంతమవుతోంది.



ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



మంజునాథ్, పవన్, చరణ్ (ఫైల్)

- చెర్లోపల్లి వద్ద ముగ్గురు పిల్లల దుర్మరణం
- ద్విచక్ర వాహనంపై వస్తుడంగా ఢీకొట్టిన ఐషర్ వాహనం
- సంఘటన స్థలంలోనే మృతి
- ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ మణికంఠ
- గ్రామంలో అములుకున్న విషాదం

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : బంగారుపాళ్యం మండలం మహాసముద్రం గ్రామానికి చెందిన ఉమాపతి కుమారుడు మంజునాథ్ (17), శ్రీనివాసులు కుమారుడు పవన్‌కల్యాణ్ (17) ఇంటర్ ద్వితీయ సంవత్సరం, చరణ్(14) ఒక ప్రైవేటు స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నారు. వీరి పెద్దలు వ్యవసాయంతో పాటు దినసరి కూలిపనులు చేసుకుంటూ కుటుంబాలను పోషిస్తున్నారు. శుక్రవారం మిట్టపల్లిలోని తమ స్నేహితుడికి పుట్టిన రోజు కావడంతో కేక్ కోసం కాణిపాకంకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. కేక్ తీసుకుని తిరిగి ప్రయాణమయ్యారు. మరికొంత సేపటిలో గ్రామానికి చేరుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో బెంగళూరు–తిరుపతి జాతీయ రహదారిలోని చెర్లోపల్లి గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న తమిళనాడుకు చెందిన ఐషర్ వాహనం ఢీకొట్టింది. దీంతో ఈ ముగ్గురు చెల్లాచెదురుగా పడ్డారు. తీవ్రంగా గాయపడి సంఘటన స్థలంలోనే మృతి చెందారు. ద్విచక్రవాహనం కూడా నుజ్జునుజ్జు అయింది. స్థానికులు ఈ విషయాన్ని గమనించి తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న మృతుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. వారి ఆర్తనాదాలతో ఆస్పత్రి దద్దరిల్లింది. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు పిల్లలు మృతిచెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

కుటుంబానికి తోడుగా నిలుస్తారనుకుంటే..

ఉన్నత చదువులు చదివి ప్రయోజకులై కుటుంబానికి తోడుగా నిలుస్తారని అనుకుంటే ఇలా కంటికి కనిపించకుండా పోయారని మృతుల కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట బోరున రోదించారు. తాము పడే కష్టాలు తమ పిల్లలకు వద్దని, ఎన్ని కష్టాలున్నా చదివిస్తున్నామని వాపోయారు. పెద్దయితే కంటికి రెప్పలా కాపాడుతారనుకుంటే.. మమల్ని వదిలి వెళ్లిపోయారు అంటూ కన్నీరుమున్నీరయ్యారు. ఒక్కగానొక్క కొడుకుని ఆ దేవుడు తీసుకెళ్లిపోయాడని చరణ్ కుటుంబ సభ్యులు రోదించారు.

సంఘటనా పరిశీలించిన ఎస్పీ..

ముగ్గురు మైనర్ పిల్లలు రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్టు సమాచారం అందుకున్న ఎస్పీ మణికంఠ చందోలు వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రెడ్డితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులను కూడా విచారించారు. ఈ కార్యక్రమంలో సీఐ కుల్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

కుక్కపిల్లలు దొరికాయ్

- ఒక్క రోజులోనే ముగ్గురి చేతులు మారిన వైనం
- ఆనందం వ్యక్తం చేసిన యజమాని



యజమాని చెంతకు చేరిన కుక్కపిల్లలు

పలమనేరు : ప్రేమతో పెంచుకున్న ముదోల్ హౌండ్ కుక్క పిల్లలు కనిపించకుండాపోవడంతో యజమాని అల్లాడారు. ఎట్టకేలకు అవి శుక్రవారం దొరకడంతో ఆనందం వ్యక్తం చేశాడు. యజమాని కథనం మేరకు.. పలమనేరు సమీపంలోని గంటావూరు వద్ద నున్న నరేష్ ఒకటిన్నరనెల వయసున్న కుక్క పిల్లలను పెంచుకుంటున్నాడు. రెండ్రోజుల క్రితం అవి ఇంటి వెనుక ఆడుకుంటుండగా ఎవరో అపహరించారు. దీనిపై నరేష్ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. పత్రికల్లోనూ కథనాలు వచ్చాయి. స్థానిక పోలీసులకు కూడా ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా గురువారం రాత్రి కనిపించకుండా పోయిన కుక్కపిల్లలో ఒకదాన్ని ఫొటోను పుంగనూరుకు చెందిన ఓ వ్యక్తి మొబైల్‌లో స్టేటస్‌లో పెట్టుకున్నాడు. దాని ఆధారంగా కుక్కపిల్లల ఆచూకీని కనిపెట్టారు.

ఎలా పట్టుకున్నారంటే...

పుంగనూరుకు చెందిన వ్యక్తి ద్వారా పలమనేరు పట్టణంలోని గడ్డూరు కాలనీకి చెందిన ఒక వ్యక్తి కుక్కపిల్లలను రూ.4 వేలకు విక్రయిస్తానంటూ డీపీలో పెట్టాడు. దీంతో పోలీసులు కుక్కల యజమాని ద్వారా గడ్డూరు వ్యక్తికి కాల్ చేయించి తాను కుక్కపిల్లను కొంటానని చెప్పించారు. అతను పుంగనూరు వ్యక్తితో మాట్లాడి డీల్ ఓకే చేశాడు. పుంగనూరు వ్యక్తి ఫోన్‌పేకు రూ.4 వేలు వేయగానే అతను కాసేపు వేచి ఉండమని బైరెడ్డిపల్లి సమీపంలోని కామినేపల్లికి చెందిన వ్యక్తిని రప్పించాడు. కుక్క పిల్ల పుంగనూరుకు రాగానే దాన్ని స్వాధీనం చేసుకున్నారు. అతన్ని విచారించగా తాను కంచనపల్లికి చెందిన వ్యక్తి నుంచి కొన్నానని చెప్పాడు. పోలీసులు, కుక్కపిల్లను తెచ్చిన వ్యక్తి, యజమానితో కలిసి మరో కుక్కపిల్ల ఉన్న వ్యక్తి వద్దకెళ్లి దాన్ని స్వాధీనం చేసుకున్నారు. కుక్కపిల్లలను అపహరించిన వ్యక్తిని పోలీసు స్టేషన్‌కి తీసుకొచ్చి విచారించారు. తాను గంటావూరులో కాంక్రీట్ పనిచేసేందుకు వచ్చానని, ఆ సమయంలో కుక్కపిల్లలను అపహరించినట్టు ఒప్పుకున్నాడు. తనకు వాటి విలువ తెలియదని, తాను పనులకు వెళ్లిన చోట ఉన్న కుక్కపిల్లలను అపహరించి అమ్ముకుంటున్నట్టు చెప్పాడు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న కుక్కపిల్లలు మళ్లీ చెంతకు చేరడంతో బాధితుడు కేసును వాపసు తీసుకున్నాడు. ఇకపై ఇలాంటి చోరీలు ఎక్కడా చేయరాదని నిందితుడిని పోలీసులు మందలించి పంపేశారు.

ఘనంగా పుష్పాభిషేకం



గోవిందరాజస్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా పుష్పయాగం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజ స్వామి వారి ఆలయంలో శుక్రవారం స్వామి వారి పుష్పయాగం కన్నుల పండువగా సాగింది. ఉదయం 9.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం చేపట్టారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం చేశారు. అనంతరం ఆలయంలో మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అర్చకుల వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి పుష్పయాగం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో మల్లెలు, రుక్షి, కనకాంబరాలు, చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, రోజా, కలువలు వంటి 12 రకాల సంప్రదాయ పుష్పాలు, తులసి, మరువం, దవణం, బిల్వం, పన్నీరాకు పత్రాలను కలిపి మొత్తం మూడు టన్నులతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారికి పుష్పయాగం చేశారు. ఈ పుష్పాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాతలు విరాళంగా అందజేశారు. కాగా సాయంత్రం 6.30 గంటలకు స్వామి, అమ్మవార్లు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, ఉద్యానవన విభాగం డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, గార్డెన్ మేనేజర్ జనార్దన్‌రెడ్డి, ఏఈవో మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ పాల్గొన్నారు.

తిరుచ్చిపై చిద్విలాసం



బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అభిషేకానంతరం అమ్మవారిని పట్టుపీతాంబరాలు, వజ్రవైఢూర్యాలతో అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఆలయంలోని శ్రీకృష్ణ ముఖమండపంలో పాంచరాత్ర ఆగమోక్తంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని అలంకార మండపం వద్ద విద్యుత్ కాంతుల నడుమ అమ్మవారికి ఊంజల్ సేవను కనుల పండువగా పూర్తిచేశారు. తదుపరి సర్వాలంకారభూషితురాలైన అమ్మవారు బంగారు తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

వైభవంగా అర్జున తపస్సు



అర్జున తపస్సుమాను ఎదుట సంతానం కోసం వరపడ్డ మహిళలు

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సుమాను వైభవంగా జరిగింది. ఉదయం స్వామి,అమ్మవార్ల విగ్రహాలకు విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. తపస్మాన్ కోసం ఆలయం ముందు తాటి చెట్టును ఏర్పాటు చేశారు. సంతానప్రాప్తి కోసం మహిళలు స్నానాలాచరించి భక్తిశ్రద్ధలతో తపస్సుమాను వద్ద వరబడ్డారు. అనంతరం అర్జున వేషధారి పద్యాలు, పాటలు పాడుతూ తపస్మాన్ ఎక్కాడు. చెట్టు పైభాగాన తమ వెంట తీసుకుని వెళ్లిన నిమ్మకాయలు, పసుపు, కుంకమ, విభూది తదితర సామగ్రికి పూజలు నిర్వహించారు. నిమ్మకాయలు, విభూదిని తపస్మాన్ చెట్టు పైభాగం నుంచి భక్తులపైకి చల్లారు. వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. మధ్యాహ్నం సుమారు. 1,500 మంది భక్తులకు అన్నదానం చేశారు.

వినాయకుడి సేవలో సినీ నటుడు



ఆలయంలో సాయిధరమ్‌తేజ్

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని శుక్రవారం సినీ నటుడు సాయి ధరమ్‌తేజ్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సిబ్బంది స్వామి దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులతో ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు ఇప్పించారు. ఆయనతో సెల్ఫీ తీసుకునేందుకు అభిమానులు పోటీ పడ్డారు. కార్యక్రమంలో సిబ్బంది కోదండపాణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని ఏపీ మోడల్‌స్కూల్‌లో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆ పాఠశాల ప్రిన్సిపల్ తులసి జ్యోతి శుక్రవారం పేర్కొన్నారు. ఈ మేరకు ఆసక్తి కలిగిన విద్యార్థులు శని, మంగళవారాల్లో తమ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి జూన్ 19వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

నీలి కిరణాలతో అంధత్వం



నేడు సెల్‌ఫోన్ నిత్యావసర వస్తువుగా మారిపోయింది. ఎవరి చేతిలో చూసినా ఫోన్ కనిపిస్తోంది. చిన్నా పెద్దా తేడా లేకుండా ఫోన్‌ను వినియోగిస్తున్నారు. ఇంట్లోనూ.. బయటా.. పది మంది కలిసిన చోటు.. చివరకు భోజనం చేసే సమయంలోనూ సెల్‌ఫోన్ చూడడంలో నిమగ్నమవుతున్నారు. గంటల తరబడి మొబైల్ చూడడం, కంప్యూటర్ స్క్రీన్‌కు అతుక్కుపోవడం వల్ల కంటి సమస్యలు ఎక్కువగా వస్తాయని డాక్టర్లు చెబుతున్నారు. ముఖ్యంగా మొబైల్ నుంచి వచ్చే నీలి కాంతి కిరణాలు కంటిపై ప్రభావం చూపి చూపు దెబ్బతినే అవకాశం కూడా ఉంటుందని పేర్కొంటున్నారు.

– బంగారుపాళెం

- సెల్‌ఫోన్, కంప్యూటర్ అతిగా వాడకంతో ఇబ్బందులు
- చిన్న వయస్సులోనే దృష్టి లోపాలు
- పెరుగుతున్న దూరదృష్టి సమస్య
- కంటి వైద్యుల వద్దకు క్యూకడుతున్న యువత

ఒకప్పుడు పగలంతా పనులు చేసుకుని సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత చీకటి పడగానే తినేసి నిద్రకు ఉపక్రమించేవారు. ఇప్పుడు ప్రజల జీవన విధానంలో మార్పులు వచ్చాయి. రాత్రి 11 గంటల వరకూ టీవీలు, మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లకు అతుక్కుపోతున్నారు. 60 శాతం ప్రజలు రోజులో 5 నుంచి 6 గంటల వరకు సెల్‌ఫోన్ చూస్తున్నారు. యువతీ యువకులు రోజుకు 10 గంటలకు పైగా స్క్రీన్‌నే చూస్తున్నారు. ఇలా సెల్ ఫోన్‌కు బానిస కావడం వల్ల చేతి వేళ్లు సెల్‌ఫోన్‌పైకి వెళ్తుంటాయి. చిన్న పిల్లలు సైతం సెల్ ఫోన్‌కు అలవాటు పడ్డారు. గతంలో సూర్యుడి కాంతి మాత్రమే కళ్లపై పడేది. ఇప్పుడు సెల్‌ఫోన్లు, టీవీల నుంచి వచ్చే కృత్రిమ కాంతిలో ఉండే బ్లూ లైట్ కంటిపై ఎక్కువగా పడుతోంది. దీనివల్ల కంటికి కొత్త చిక్కులు వచ్చిపడుతున్నాయి. చిన్న వయస్సులోనే కంటి రోగాల బారినపడి ఆస్పత్రుల బాటపడుతున్నారు.

కంప్యూటర్ విజన్ సిండ్రోమ్

కంప్యూటర్ విజన్ సిండ్రోమ్‌ను డిజిటల్ ఐ స్ట్రైన్ అంటారు. ఇది ఎక్కువ కాలం కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు, టీవీలు చూడడం వల్ల వస్తుంది. కళ్లు ఒత్తిడికి గురికావడం, అలసిపోవడం, కళ్ల మంటలు, కళ్లు ఎరుపు కావడం, ఒక వస్తువు రెండుగా కనిపించడం, కళ్లు పొడిబారడం, నల్ల గుడ్డు పొడిబారడం, మయోపియా ఎక్కువ కావడంలాంటి లక్షణాలు ఉంటాయి.

కారణాలు

- డిజిటల్ పరికరాలను విస్తృతంగా వినియోగించడం
- రెండు గంటలకన్నా ఎక్కువగా కంప్యూటర్, సెల్‌ఫోన్ తదేకంగా చూడడం
- కంప్యూటర్‌లో అక్షరాలను తదేకంగా చూడడం వల్ల కళ్లు ఒత్తిడికి గురవుతాయి.
- స్క్రీన్ కాంట్రాస్ట్ ఎక్కువగా ఉండడం.
- సాధారణంగా నిమిషానికి 18 నుంచి 20 సార్లు రెప్ప వాల్చాలి. కానీ కంప్యూటర్ చూసే వారికి ఇది 3 నుంచి 6 సార్లకు పడిపోతుంది.
- దీనివల్ల కళ్లలోని ఉపరితలం పొడిబారుతుంది.

వ్యాధి నిర్ధారణ

- కంప్యూటర్‌తో గడిపే సమయం.
- కంప్యూటర్ చూసేటప్పుడు కూర్చునే భంగిమలు.
- ఇతర వైద్య కారణాలు (డ్రగ్ రియాక్షన్, కీళ్ల నొప్పులు).



- మైబోమియా గ్లాండ్ పరీక్ష

చికిత్స, నివారణ

- కళ్లకు తేమను కలిగించేలా కృత్రిమంగా కన్నీళ్లు తరచూగా వాడటం.
- కళ్ల రెప్పలను తరచుగా మూయడం.
- దృష్టి లోపాలకు వాడే అద్దాలు బ్లూఫిల్టర్ ఉండేలా చూడడం.
- స్క్రీన్ టైమ్ తగ్గించుకోవడం
- 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువులను 20 సెకన్ల పాటు వీక్షించడం.
- కంప్యూటర్, సెల్‌ఫోన్ స్క్రీన్ బ్రైట్‌నెస్, కాంట్రాస్ట్‌ను సర్దుబాటు చేసుకోవడం.
- కంప్యూటర్, సెల్‌ఫోన్‌లో ఫాంట్(అక్షరాలు)ను పెద్దవిగా చేసుకోవడం.
- సంవత్సరానికి ఒకటి, రెండు సార్లు డ్రై ఐ గురించి కంటి వైద్యులను సంప్రదించడం.

బ్లూ లైట్‌తో కళ్లకు ప్రమాదం

మొబైల్ ఫోన్‌లో ఉండే నీలి కాంతి కళ్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మొబైల్ కాంతి ఎక్కువగా పెట్టుకుని చూడడం వల్ల వాటిలోని రేడియేషన్, అల్ట్రావైలెట్ రేస్ వల్ల కళ్లలో నీళ్లు ఇంకిపోయి పొడిబారుతాయి. విద్యార్థులు, యువకులు మొబైల్, కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లను దగ్గర నుంచి చూడడం వల్ల క్రమంగా వారికి మయోపియా(దూరంగా ఉన్నవి కనిపించవు) సమస్య వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా దృష్టి లోపం ఉండే వారిలో ఏడాది నుంచి రెండేళ్లకు వారి కంటి అద్దాల నెంబర్ మారుతుంది. కానీ ఎక్కువసేపు ఆన్‌లైన్ క్లాస్‌ల కారణంగా తక్కువ సమయం(ఆరునెలలు)లోనే కంటి అద్దాల నెంబర్ మారుతోంది. దీనికితోడు వర్క్ ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ క్లాస్‌ల పేరుతో ఉదయం నుంచి సాయంత్రం వరకు తదేకంగా మానిటర్లను చూడడం వల్ల కంటి కండరాలపై ఒత్తిడి పెరిగి సాయంత్రం వేళ తలనొప్పి వస్తుంది.

కంటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు

- ప్రతి అరగంటకు ఒక్కసారి మొబైల్/కంప్యూటర్/ల్యాప్‌టాప్ నుంచి రెండు మూడు నిముషాలైనా దృష్టిని వేరే వైపునకు మరల్చాలి.
- కంటికి స్క్రీన్‌ను 25 నుంచి 40 అంగుళాల దూరం ఉంచాలి.
- యాంటీగ్లేర్, యాంటి రిఫ్లెక్టివ్ అద్దాలను వాడితే కంటికి రక్షణగా ఉంటుంది. ఇవి అధిక కాంతిని కళ్లపై పడకుండా అడ్డుకుంటాయి.
- కళ్ల మంటలు, నీరు కారడం వంటి సమస్యలుంటే కాసేపు మానిటర్లను చూడడం ఆపేయాలి.
- తరచూ చల్లని నీటితో కళ్లను కడుక్కోవాలి. రాత్రి నిద్రించే సమయంలో కళ్లపై కాసేపు తడి వస్త్రాన్ని కప్పి ఉంచాలి.
- కంటికి కసరత్తులు సైతం అవసరం. ఇందుకోసం కళ్లను కుడిఎడమలకు అరనిముషం నుంచి నిముషం పాటు తిప్పాలి. రెండు అరచేతులు రుద్దుకుని వేడెక్కిన తరువాత కళ్లపై కాసేపు ఉంచే కసరత్తు చేయాలి.

ఎక్కువగా సెల్‌ఫోన్ చూడరాదు



కంప్యూటర్, సెల్‌ఫోన్‌ను ఎక్కువ సేపు చూడడం వల్ల అందులోని నీలికాంతి కళ్లపై పడి కళ్లు దెబ్బ తింటాయి. కంటి జబ్బులతో వస్తున్న వారిలో కళ్లు పొడిబారడం, కళ్లు ఎర్రగా కావడం, కళ్ల మంటలు, కంట్లో దురద వంటి సమస్యలు ఉంటున్నాయి. మొబైల్ ఫోన్‌లు, కంప్యూటర్ మానిటర్లను ఎక్కువసేపు చూడడం వల్లే ఈ సమస్య అధికమవుతోంది.

– డాక్టర్ శిరీష, సీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి, బంగారుపాళెం

బాలమందిరంలో ప్రవేశాలకు దరఖాస్తులు

తిరుపతి(అలిపిరి): ఎస్వీ బాలమందిరంలో 2024–25 విద్యాసంవత్సరానికి అనాథ బాలబాలికల ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు టీటీడీ డీఈఓ డాక్టర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. హిందువులుగా ఉండి 2024 జూన్ 15 నాటికి 5–10 ఏళ్ల లోపు వయస్సు కలిగి తల్లిదండ్రులు లేని అనాథ బాలబాలికలను చేర్చేందుకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. జనన, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో జులై 5వ తేదీ లోపు స్వయంగా గాని.. తపాలాలో దరఖాస్తులను 'ఏఈవో, ఎస్వీ బాలమందిరం, టీటీడీ, భవానీనగర్, తిరుపతి-517501' చిరునామాకు పంపాలన్నారు. వివరాలకు ఫోన్ నం .0877-2264613లో సంప్రదించాలని కోరారు.

కోర్టులకు ముగిసిన సెలవులు

తిరుపతి లీగల్: రాష్ట్ర హైకోర్టు అదనపు జిల్లా జడ్జి కోర్టులకు, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు గత నెల 13వ తేదీ నుంచి ఇచ్చిన వేసవి సెలవులు శుక్రవారంతో ముగిశాయి. శనివారం నుంచి కోర్టులు యథావిధిగా పనిచేయనున్నాయి.

ఎంఆర్‌హెచ్‌ఆర్‌యూలో జీఐఎస్‌పై వర్క్‌షాప్



మాట్లాడుతున్న తిరుపతి ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్

చంద్రగిరి: స్థానిక టవర్‌క్లాక్ సమీపంలోని మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చ్ యూనిట్ (ఎంఆర్‌హెచ్‌ఆర్‌యూ) ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజారోగ్యంలో భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్) వాడకం అనే అంశంపై ఓరియంటేషన్ ట్రైనింగ్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్‌తో పాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ, వ్యాధులు, సేవల అందజేతపై జీఐఎస్ నిఘా, మ్యాపింగ్, వనరుల కేటాయింపు, రోగి సంరక్షణతో పాటు ఇతర వివరాల కోసం ఈ జీఐఎస్ వ్యవస్థ పనిచేస్తుందని, అందుకే ఈ వర్క్‌షాప్ పెట్టినట్టు వెల్లడించారు. జీఐఎస్ ఫండమెంటల్స్, క్వాంటం జీఐఎస్‌ను ఇన్‌స్టాల్, కో-ఆర్డినేట్ సిస్టమ్ మ్యాప్ ప్రొజెక్షన్ డేటా రకాలు, ప్రజారోగ్యంలో జీఐఎస్ అవసరం, నావిగేషన్ టూల్స్‌తో పనిచేసే డేటాను ప్రదర్శించడం తదితరాల గురించి చెన్నైలోని ఐసీఎంఆర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎపిడెమియాలజీ నుంచి డాక్టర్ శ్రీనివాసన్, వెట్రిచెల్వన్, చొక్కలింగంలు వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో తిరుపతి ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మూర్తి, ఎంఆర్‌హెచ్‌ఆర్‌యూ నోడల్ అధికారి డాక్టర్ సునీత, అధ్యాపక బృందం, శాస్త్రవేత్తలు డాక్టర్ వెన్నెల సాహితి, డాక్టర్ యూవీ. ప్రసాద్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి



మృతి చెందిన సావిత్రమ్మ

శ్రీరంగరాజపురం : మండలంలోని గంగమ్మగుడి వద్ద శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మహిళ మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. గంగమ్మగుడి గ్రామానికి సావిత్రమ్మ (65) శుక్రవారం ఉదయం చిత్తూరు – పుత్తూరు జాతీయ రహదారి పక్కన వాకింగ్‌కు వెళుతోంది. ఈ క్రమంలో వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఆమెను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజాకుల్లాయప్ప కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన లింగయ్య

పుంగనూరు: మండలంలోని ఆరడిగుంటకు చెందిన లింగయ్య (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన లింగయ్య గురువారం రాత్రి నిద్ర పట్టడం లేదని, ఇబ్బందిగా ఉందని చెప్పి సచివాలయం మార్గం వైపు వచ్చాడు. ఏమి జరిగిందో కాని మృతి చెందాడు. కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం లింగయ్య మృతదేహాన్ని గుర్తించారు. ఆయన మృతిపై దుష్ప్రచారం చేశారు. విషయం తెలిసిన వెంటనే గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. సీఐ రాఘవరెడ్డి, పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులను విచారించారు. ఈ మేరకు అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్టు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో వాస్తవాలు వెల్లడికావాల్సి ఉంది.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో నెల్లూరు నుంచి చెన్నై వెళ్లే మెమో రైలును ఎక్కుతూ ఓ గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తూ జారిపడ్డాడు. తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. మృతుడి వయస్సు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు. అతనికి రెండు కాళ్లు, రెండు చేతులకు బలమైన గాయాలు కావడంతో వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి దాటాక మృతి చెందాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. మృతుడు మెరూన్ కలర్, బ్లాక్ మీద సన్నటి తెలుపురంగు చారలతో కూడిన గళ్ల చొక్కా ధరించి ఉన్నాడు. మెడలో నల్లటి తాడు ఉంది. ఆచూకీ తెలిస్తే తమను సంప్రదించాలని, లేకుంటే మున్సిపాలిటీ వారికి అప్పగించి ఖననం చేయిస్తామని రైల్వే పోలీసులు చెప్పారు.

చెరువులో గుర్తుతెలియని యువకుడి మృతి

చంద్రగిరి(తిరుచానూరు): చెరువులో పడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుచానూరు ఎస్ఐ జగన్నాథరెడ్డి వివరాల మేరకు.. సుమారు 30 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగిన యువకుడు సప్తగిరి కాలనీ పంచాయతీ పరిధిలోని అన్నాచెరువు వద్ద మృతి చెందినట్లు సమాచారం వచ్చింది. మృతి చెంది సుమారు నాలుగు రోజులకు పైగా కావడంతో మృతదేహం గుర్తుపట్టలేనంతగా మారిపోయింది. మృతుడు మోకాళ్ల వరకు కత్తిరించిన నీలి రంగు ప్యాంటు వేసుకుని ఉన్నాడు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు తిరుచానూరు సీఐ–94407 96755, ఎస్ఐ–99595 04860 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ఫార్మసీలో జాతీయ సెమినార్



ఎంబీయూలో డాక్టర్ శ్రీనివాస్ నందూరిను సత్కరిస్తున్న వీసీ నాగరాజ రామారావు

చంద్రగిరి: మండల పరిధిలోని శ్రీసాయినాథ నగర్‌లోని మోహన్‌బాబు యూనివర్సిటీలోని ఫార్మసీలో జాతీయ సెమినార్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ సెమినార్‌కు ఎన్ఐపీఈఆర్ హైదరాబాద్ నుంచి డాక్టర్ శ్రీనివాస్‌నందూరి, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ నుంచి డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విలియం కేరీ, బయోకాన్ ప్రైవేట్ లిమిటెడ్ బెంగళూరు నుంచి డాక్టర్ ప్రవీణ్, మోహన్‌బాబు యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ నగరాజ్ రామారావులు పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారి నైపుణ్యం, అవగాహన కోసం ఆసక్తికరమైన చర్చలు జరిపారు. కాన్ఫరెన్స్‌లో మొదటి రోజు ×డ్రగ్ డిస్కవరీ, జాతీయ, అంతర్జాతీయంగా జరుగుతున్న పురోగతులు౯ అనే అంశంపై చర్చించారు. ప్యానెలిస్టులు ఫార్మస్యూటికల్, మెడికల్ సైన్సెస్ రంగాల్లో ఇన్నోవేషన్స్ ప్రాముఖ్యతను, వైద్య నైతికత, ఫార్మస్యూటికల్ సైన్సెస్‌లో ఇన్నోవేషన్ అవసరంపై మేధావులతో చర్చించారు.

జిల్లా రగ్బీ జట్టు ఎంపిక

శ్రీకాళహస్తి: బాపట్లలోని కేవీఆర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 15, 16 తేదీలలో జరిగే రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు చిత్తూరు జిల్లా జట్టును శుక్రవారం ఎంపిక చేశారు. రెండో పట్టణ సీఐ రారాజు క్రీడాకారులకు టీషర్ట్‌లను అందజేశారు. ఎంపిక చేసిన జట్టులో మురళి, సాయి తేజ, శ్రీనివాసులు, భానుప్రకాష్, డికేష్, అవినాష్, భరత్, జగదీష్, దినేష్, చంద్ర, శంకర్, గణేష్ ఉన్నారు. జిల్లా కార్యదర్శి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీలో ఓపెన్ హౌస్ రేపు

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక రెవెన్యూలో ఉన్న ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో ఆదివారం ఓపెన్ హౌస్ కార్యక్రమం ఉంటుందని డైరెక్టర్ కేఎన్.సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భావి విద్యార్థుల కోసం జేఈఈ అడ్వాన్స్ 2024లో అర్హత పొందిన విద్యార్థులతో ఇంటరాక్టివ్ సెషన్ జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో అకడమిక్ ప్రోగ్రాంలు, క్యాంపస్ అభివృద్ధి, విద్యార్థుల జీవిత అవలోకాన్ని పొందవచ్చని తెలిపారు. సెషన్ ప్రధానంగా ఇన్‌స్టిట్యూట్ అండర్ గ్రాడ్యుయేట్ పాఠ్యాంశాలు, డ్యూయల్ డిగ్రీలు, బ్రాంచి మార్పు విధానం, హాస్టల్ మౌలిక, ఆరోగ్య సౌకర్యాలు, విద్యార్థి కేంద్రీకృత సమాచారం ఉంటుందని వెల్లడించారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



పూజలు చేసుకుంటున్న మంచు లక్ష్మి, ప్రగ్యా జైస్వాల్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఇందులో సినీ నటుడు సాయికుమార్, ఆయన తనయుడు హీరో ఆది సాయికుమార్ ఉన్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ప్రత్యేక రాహు-కేతు పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనాలు అందించగా.. ఆలయ అధికారులు స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా ప్రముఖ నటుడు మోహన్‌బాబు కుమార్తె మంచు లక్ష్మి, హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్ స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.